క్లుప్తంగా

చిన్నారులకు మ్యూజికల్ చైర్ పోటీలు



మ్యూజికల్ చైర్ పోటీల్లో చిన్నారులు

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు సోమవారం మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు క్రీడలపై ఆసక్తి కల్పించేందుకు ఈ పోటీలుఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.నరేష్, పి.వరప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



చేతి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: వేసవిలో నీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు చేపట్టామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని అంబేడ్కర్ కాలనీ బంగారు తల్లి గుడి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్వై నాయుడు, కరజాడ కృష్ణ, కోట నాయుడు, దుర్గారెడ్డి, విజయలక్ష్మి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతృమూర్తులకు ఘన సత్కారం



మాతృమూర్తులను సత్కరిస్తున్న నిర్వాహకులు

గాజువాక : స్థానిక అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు మాతృమూర్తులను సోమవారం ఘనంగా సత్కరించారు. కొత్తగాజువాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాతృమూర్తులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ అని, అమ్మ లేనిదే జన్మే లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ట్రస్టు చైర్మన్ బాటా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు భాస్కర్, అయ్యల నాయుడు, గూటూరు శంకరరావు, నాగవల్లి పాల్గొన్నారు.

నేడు ఆర్డీవోతో ముఖాముఖి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక రెవెన్యూ పరిధిలో తమ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మంగళవారం గాజువాక రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓతో ముఖాముఖి కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు తదితర అంశాలపై నేరుగా తమ సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అపార్ట్‌మెంట్ల సంస్కృతి విస్తృతం

అనుకూలమైన వాతావరణం.. అందుబాటులో చక్కటి సదుపాయాలు ఉండడంతో కూర్మన్నపాలెం పరిసర ప్రాంతాల్లో నివసించేందుకు అనేక మంది మొగ్గు చూపుతున్నారు. దీంతో బిల్డర్లు ఈ ప్రాంతంలో చక్కటి అపార్ట్‌మెంట్లు నిర్మిస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

- కాలుష్యానికి దూరంగా కూర్మన్నపాలెం
- మెరుగైన రవాణా సౌకర్యాలు
- అత్యాధునిక సదుపాయాలు



రాజీవ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లు

కూర్మన్నపాలెం : నివాసానికి యోగ్యమైన చక్కటి వాతావరణం ఉండడంతో కూర్మన్నపాలెం పరిసర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో నిర్మాణదారులు కూడా అనుకూలమైన స్థలాలను ఎంపిక చేసి భారీ భవనాలు నిర్మిస్తున్నారు. ముఖ్యంగా రాజీవ్‌నగర్, కూర్మన్నపాలెం తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో అపార్ట్‌మెంట్లు నిర్మించి కూర్మన్నపాలెం ప్రాంతాన్ని అభివృద్ధి పరచడంలో బిల్డర్లు కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతం కాలుష్యానికి దూరంగా ఉండడంతో పాటు రోడ్డు, రైలు మార్గం, విమానాశ్రయం కూడా దగ్గరగా ఉండడంతో ప్రతి ఒక్కరు కూర్మన్నపాలెంలో నివసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అనేక ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులతో పాటు నగరానికి కొత్తగా ఎవరు వచ్చినా కూర్మన్నపాలెం ప్రాంతాన్నే ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో ఈ విషయం గమనించిన బిల్డర్లు కూడా సకల సదుపాయాలతో అపార్ట్‌మెంట్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. విశాఖ నగరంలో ఎక్కడా లేనంతగా కూర్మన్నపాలెం ప్రాంతంలోనే వేలాదిగా అపార్ట్‌మెంట్లు నిర్మించి లక్షల మందికి నివాసాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. 1000, 1200, 1500 చదరపు అడుగుల్లో రెండు లేక మూడు బెడ్ రూములు నిర్మించి అమ్మకాలు సాగిస్తున్నారు. కూర్మన్నపాలెంలో అపార్ట్‌మెంట్ కల్చర్ పెరగడంతో రకరకాల షాపింగ్‌మాల్స్ కూడా ఏర్పాటు అవుతున్నాయి. దీని వల్ల చాలా మందికి ఉపాధి లభిస్తోంది. తద్వారా ఈ ప్రాంతం దినదినాభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోంది. ఇప్పటికే రాజీవ్‌నగర్, కూర్మన్నపాలెం ప్రధాన రహదారులకు ఇరువైపులా భారీ బహుళ అంతస్తులు నిర్మించి జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలా ముందు ముందు కూడా కొనసాగితే కూర్మన్నపాలెం కూడా మరో నగరంగా రూపుదిద్దుకోగలదనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇప్పటికే విశాఖ ఉక్కు కర్మాగారం, హెచ్‌పీసీఎల్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల నుండి అధికారుల వరకు ఈ ప్రాంతంలోనే ప్లాట్లు కొనుగోలు చేసి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. త్వరలోనే ఈ ప్రాంతం రద్దీగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులు పూర్తిస్థాయిలో విస్తరించి నిర్మాణం చేయడంతో రవాణా మార్గం కూడా అభివృద్ధి సాధించింది. కూతవేటు దూరంలో దువ్వాడ రైల్వేస్టేషన్ ఉండడం వల్ల ఎక్కువ మంది రాజీవ్‌నగర్‌లోనే నివాసం ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వస్తున్నారు.

ఫార్మా మేజర్ సన్స్‌కు పట్టాల పంపిణీ నేడు

అగనంపూడి: దశాబ్దంన్నర కాలంగా ఎదురు చూస్తున్న ఫార్మా మేజర్ సన్స్ కల నెరవేరబోతోంది. మంగళవారం ఉదయం 9 గంటలకు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలో నిర్వహించనున్న కార్యక్రమంలో పట్టాలు అందించనున్నట్టు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నారని చెప్పారు. ఫార్మాసిటీ నిర్వాసితుల్లో వివాహిత కుమారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలివ్వాలని 2008 నుంచి డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా మేజర్ సన్స్ పట్టాలకు మోక్షం కలగలేదు. 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అభ్యర్థన మేరకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ప్రభుత్వ పెద్దలు వెంటనే అర్హులకు పట్టాలివ్వాలని ఆదేశించడంతో 134 మంది వివాహిత కుమారులకు స్థలాల పట్టాలు అందించనున్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



823వ రోజు ఉక్కుదీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పోరాడాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 823వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న సంస్థలోని పలు విభాగాల కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం తహతహలాడుతోందన్నారు. విశాఖ ఉక్కు జోలికి వస్తే కార్మికులు, నిర్వాసితులు, ఆంధ్రరాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. దీక్షలు చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవ్వరూ వచ్చినా అడ్డుకుంటామని, పోరాటాలు, ప్రాణత్యాగాలతో ఏర్పాటైన కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

బోధనలో మెలకువలపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సింహాచలం: ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడానికి అవసరమైన మెలకువలు ఉపాధ్యాయులు తెలుసుకోవాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ యు. మాణిక్యం నాయుడు సూచించారు. నూతంగా ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన 1998,2008,2018 సంవత్సరాలకు సంబంధించి మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులకు సోమవారం నుంచి పెందుర్తిలోని శ్రీ చైతన్య పాఠశాలలో మొదటి విడత బ్యాచ్ శిక్షణ తరగలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి 300 మంది ఉపాధ్యాయులు ఈశిక్షణ తరగతులకు హాజరయ్యారు. మాణిక్యం నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీఆర్టీ ప్రొఫెసర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 50 మంది ఉపాధ్యాయులకు నలుగురేసి రిసోర్స్ పర్సన్లు చొప్పున తెలుగు, ఇంగ్లిషు, పరసరాల విజ్ఞానం, గణితం, సాధారణ అంశాలు, విద్యలో సాంకేతికత వినియోగం తదితన అంశాలపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు గొట్టేటి రవి, రిసోర్స్ పర్సన్లు ఉమా గుప్త, దొర, ప్రసన్న కుమార్, సోమయాజులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంసెట్ పరీక్ష



గేటు వద్ద ఆలస్యంగా వచ్చిన విద్యార్థిని

అక్కిరెడ్డిపాలెం: స్థానిక షీలానగర్ ఐయాన్ డిజిటల్ సెంటర్‌లో సోమవారం ఏపీ ఎంసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిబంధనల ప్రకారం వాచీలు, షూలు, ఫుల్ హ్యాండ్ షర్టులు ధరించిన విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించలేదు. అదే విధంగా వాచీలు, లావుపాటి గాజులు ధరించిన విద్యార్థినులకు వాటిని తొలగించాలని సూచించారు. సమయం అంశంలో కచ్చితంగా నిబంధనలు పాటించారు. ఎంవీపీ నుంచి వచ్చిన విద్యార్థిని ఎస్. లక్ష్మి ప్రసన్న రెండు నిమిషాలు ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదు. ఆమె తల్లిదండ్రులు బ్రతిమాలినప్పటికీ ఫలితం లేకపోయింది.

ముట్టడి విజయవంతం చేయాలి



ఉక్కు మెయిన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిని విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలన్న డిమాండ్‌పై ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న ముట్టడికి చెందిన ప్రచార కార్యక్రమం సోమవారం ప్లాంట్‌లోని వివిధ విభాగాలు, కూడళ్లు, అన్ని గేట్ల వద్ద నిర్వహించారు. ఇందులో నాయకులు మాట్లాడుతూ సెయిల్‌లో 2021 డిసెంబర్ నుంచి నూతన వేతనాలు అమలు చేయగా ఇక్కడ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. దాని వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ పిలుపు

స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి విజయవంతం చేయాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన వేతనాలు సాధించడం ప్రతీ కార్మికుని హక్కన్నారు. దాని కోసం ప్రతీ కార్మికుడు అడ్మిన్ ముట్టడికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం. పరదేశి, బి. రామకృష్ణ, డి. పుల్లారావు, బి.వి. రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : జీవీఎంసీ 72వ వార్డులోని పోలీస్ స్టేషన్ జంక్షన్ వందడుగుల రోడ్డు వద్ద కల్వర్టు నిర్మాణానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.29.98 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, నాయకులు మధు, పరీదుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వితరణ



మహిళలకు వస్తువులు అందజేస్తున్న నిర్వాహకులు

అక్కిరెడ్డిపాలెం: స్థానిక శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కాపు తుంగ్లాంలో జరిగిన కార్యక్రమంలో దివంగత కుప్పిలి శ్యామలాంబ పట్నాయక్ పేరిట పేద మహిళలకు భోజనం ప్లేట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కుప్పిలి కీర్తి పట్నాయక్, రామిరెడ్డి, వలంటీర్ సాయి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

నేవీ హాస్పిటల్ పాలిక్లినిక్ సందర్శన

సింధియా: ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణిలో ఉన్న నేవీ హాస్పిటల్ పాలి క్లినిక్‌ను సోమవారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సందర్శించారు. అక్కడి అధికారులతో ఆయన మాట్లాడి ఆస్పత్రి సిబ్బంది, రోగులకు కావాల్సిన భవిష్యత్తు అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలను పాలి క్లినిక్‌కు అంబులెన్స్, రోగుల కోసం కుర్చీలు, ఇతర అవసరాల నిమిత్తం అందజేస్తానని జీవీఎల్ హామీ ఇచ్చారు. నేవీ హాస్పటల్, పాలి క్లినిక్ అభివృద్ధి కోసం రక్షణ, ఆర్థిక మంత్రిత్వ శాఖలకు తెలియపరిచి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు. నేవీ అధికారులు ఆయనకు జ్ఞాపిక అందజేశారు.

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట : ఢిల్లీలో మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యు, పీడీఎస్‌యూ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నిరసనకారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ, నేటి వరకు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక/పెదగంట్యాడ: వినాయకనగర్ వుడా కాలనీ శివాలయం, గొంతినవానిపాలెంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పాలన సాగిస్తున్నారని వివరించారు. వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, గొరుసు సత్యం, పైడినాయుడు, ప్రసాద్, రెడ్డి జగన్నాథం, ఆలీ, పాల అప్పలరెడ్డి, జి.వెంకటరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

బొగ్గు లారీల కాలుష్యంపై ఫిర్యాదు



కాలుష్యం నుండి కాపాడాలని అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: గంగవరం పోర్టు నుంచి హిందూజా పవర్‌ప్లాంట్‌కు లారీలతో తరలిస్తున్న బొగ్గు వల్ల కాలుష్యం బారిన పడుతున్నామని అగనంపూడికి చెందిన నాయకులు కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారులు పి.ప్రసాదరావు, ఎస్.వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. గంగవరం పోర్టు నుంచి గాజువాక, శ్రీనగర్, కూర్మన్నపాలెం, అగనంపూడి, లంకెలపాలెం మీదుగా నిత్యం వందలాది భారీ వాహనాలతో బొగ్గును రవాణా చేస్తున్నారన్నారు. ఆ సమయంలో వాహనాల నుంచి బొగ్గు రవ్వలు ఎగిరి వాహనచోదకుల కళ్లలో పడుతుండడంతో పాటు గాలికి పరిసర ప్రాంతంలోని ఇళ్లలోకి పడి నల్లగా మారిపోతుందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఫార్మాసిటీలోని వివిధ కంపెనీల నుంచి రాత్రి వేళల్లో, తెల్లవారు జామున వ్యాపిస్తున్న కాలుష్యంపై అగనంపూడి హార్టికల్చరల్ సొసైటీ అధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, విందుల ఈశ్వరరావు వినతిపత్రం అందజేశారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం



శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని యారాడ గ్రామంలోని శ్మశాన వాటికను అన్ని విధాలా అభివృద్ధి చేసి, సదుపాయాలు కల్పించనున్నామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈ మేరకు అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఇక్కడ దహన సంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడ సదుపాయాలు కల్పించేందుకు రూ.40 లక్షల నిధులు కేటాయించామన్నారు. ఈ పనులను చకచకా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగోతి మధు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఎముకుల సామర్థ్య పరీక్షలు



ఎముక సామర్థ్య పరీక్ష చేస్తున్న వైద్యులు

గాజువాక : వైఎస్సార్‌సీపీ 72వ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఎముకుల సామర్థ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2వేల నుంచి రూ.3 వేలు ఖర్చుతో కూడుకున్న ఈ పరీక్షలను ఉచితంగా చేయడం అభినందనీయమన్నారు. పరీక్షల అనంతరం అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సింగపూర్ హెల్త్ అకాడమీ సర్టిఫైడ్ డాక్టర్ ఇమాని శ్రీనివాసరావు హైదరాబాద్ నుంచి వచ్చి ఈ వైద్య సేవలు అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు ఉరుకూటి అప్పారావు, ధనలక్ష్మి, మధు, విజయ, నాగమణి, వరలక్ష్మి, పద్మ, పరీదుల శ్రీనివాస్, సాయి, రమేష్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కుంచుమాంబ అనుపోత్సవం నేడు



కుంచుమాంబ అమ్మవారు

గాజువాక : గాజువాక గ్రామ దేవత కుంచుమాంబ పండగ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అనుపోత్సవం నిర్వహించనున్నారు. తెల్లవారి నుంచే అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. నాతయ్యపాలెం, షీలానగర్, మల్కాపురం, శ్రీహరిపురం, కూర్మన్నపాలెం ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. గాజువాక మెయిన్ రోడ్డులో ఇప్పటికే విద్యుద్దీపాలను భారీగా ఏర్పాటు చేశారు.

ట్యాంకర్‌ను ఢీ కొట్టిన లారీ

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు



క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్ చంబూరాజ్ బహర్

సబ్బవరం: అనకాపల్లి– ఆనందపురం జాతీయ రహదారిలో ఇరువాడ వద్ద సోమవారం రెండు వాహనాలు ఢీ కొట్టుకున్న ఘటనలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు దరి చేబ్రోలులో ఓ హేచరీ నుంచి చేపల లోడుతో లారీ ఆదివారం 11 గంటలకు కోల్‌కతా బయలుదేరింది. సోమవారం ఉదయం ఇరువాడ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న వాటర్ ట్యాంకర్‌ను చేపల లోడు లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కు పోయాడు. పోలీసులు క్రేన్ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీయించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రెండు కాళ్లు విరిగిపోయినట్లు సబ్బవరం హెచ్‌సీ సత్యనారాయణ చెప్పారు. క్షతగాత్రుడిని 108 లో అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.